
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



సిద్దిపేట

5

శనివారం 24 ఆగస్టు 2024



పోటాపోటీ..

ఉమ్మడి మెదక్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాలకు సంబంధించిన పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలకు గడువు సమీపిస్తోంది. ప్రస్తుతం పట్టభద్రుల ఎమ్మెల్సీగా కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి జీవన్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా కూర రఘోత్తమరెడ్డి ఉన్నారు. ఆరు సంవత్సరాల పదవీకాలానికి గాను 2019 మార్చి నెలలో ఎన్నికైన వీరి పదవీకాలం వచ్చే మార్చితో ముగియనుంది. అప్పటిలోగా ఈ స్థానాలకు ఎన్నికలను నిర్వహించేందుకు వచ్చే నెల నుంచే ఓటర్ల నమోదు ప్రక్రియ ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో ఆశావహులు ఇప్పటి నుంచే తమ ప్రయత్నాలు మొదలు పెట్టారు.

- ఉమ్మడి మెదక్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల సందడి
- పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలపై పలువురి ఆశలు
- వచ్చే ఏడాది మార్చితో ముగియనున్న జీవన్‌రెడ్డి, రఘోత్తమరెడ్డి పదవీకాలం
- సెప్టెంబరు నుంచే ఓటర్ల ఎన్‌రోల్‌మెంట్
- ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్న ఆశావహులు
- మద్దతు కోసం ఆయా పార్టీల ముఖ్యనేతలతో మంతనాలు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, ఆగస్టు 23: అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల ఫలితాలపై గ్రామాల్లో చర్చ కొనసాగుతూనే ఉంది... ఇంతలోనే గ్రామ పంచాయతీలు, స్థానిక సంస్థల పదవీకాలం ముగిసింది. పాలనా సౌలభ్యం కోసం ప్రత్యేకాధికారులను నియమించినా ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. ఇందుకు సంబంధించిన ప్రక్రియ కొనసాగుతుండగానే శాసనమండలి ఎన్నికలపై చర్చ మొదలైంది. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో భిన్న ఫలితాలు రావడంతో విద్యావంతులు ఎవరి వైపు మొగ్గుచూపుతారోననే ఉత్కంఠ రేకెత్తిస్తోంది.

ఆరు నెలల ముందే సందడి

పట్టభద్రుల ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘోత్తమరెడ్డి పదవీకాలం ఆరునెలల్లో ముగియనుంది. ఆయా స్థానాలను దక్కించుకోవడానికి ఆశావహులు ఇప్పటి నుంచే ప్రయత్నాలు ప్రారంభించారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు గ్రాడ్యుయేట్ ఓటర్ల జాబితాను సిద్ధం చేయాల్సి ఉంటుంది. ఈసారి కూడా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటర్లుగా డిగ్రీ పూర్తిచేసిన వారందరిని సెప్టెంబరు నుంచే నమోదు చేయాలని ఆదేశాలు వచ్చాయి. ఈక్రమంలో ఎమ్మెల్సీ పదవులను ఆశిస్తున్నవారు తమకు అనుకూలమైన పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయించుకోవాలని కోరుతున్నారు. వాట్సాప్‌గ్రూపులు తయారు చేసి టచ్‌లో ఉంటున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఆశావహులు సైతం ప్రభుత్వ ఉపాధ్యాయులతో ప్రత్యేక వాట్సాప్‌గ్రూపులను ఏర్పాటు చేస్తున్నారు. ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు కూడా తమ సంఘం సభ్యుడికే పదవి రావాలని అప్రమత్తమవుతున్నారు.

తాయిలాలు.. సేవా కార్యక్రమాలు

ఎమ్మెల్సీ రేసులో ఉన్న పలువురు ఆశావహులు ఇప్పటి నుంచే ప్రచారం షురూ చేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పదవిని ఆశిస్తున్న ఓ వ్యక్తి ఇటీవల సిద్దిపేటలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. పలువురు ఉపాధ్యాయులను సమీకరించి హామీలు గుప్పించాడు. తాయిలాలు సైతం సమర్పించుకున్నాడనే చర్చ జరుగుతోంది. ఆర్థికపరమైన లోటు లేకపోవడంతో మద్దతు కోసం ఆయా పార్టీల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాడు. అదేవిధంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాన్ని ఆశిస్తున్న ఓ వైద్యుడు సామాజిక కార్యక్రమాలు చేపడుతున్నారు. పోటీపరీక్షలకు సిద్ధమవుతున్నవారికి పుస్తకాలు ఇచ్చి సాయపడుతున్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ రేసులో ఉన్న మరో విద్యావేత్త స్థానికంగా ఉన్న నిరుద్యోగుల కోసం కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. మరికొంతమంది కూడా తెరవెనుక ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇప్పటి నుంచే ప్రజాక్షేత్రంలోకి అడుగుపెడితే ఆర్థికంగా నష్టపోతామని వెనకాడుతున్నారు.

ముఖ్యనేతల చుట్టూ ప్రదక్షిణలు

ఆరేళ్ల పదవీకాలం, పెద్దల సభలో సభ్యుడిగా గౌరవం పొందాలనే ఉద్దేశంతో చాలామంది ఆశావహులు ఎమ్మెల్సీ పదవి కోసం ప్రయత్నం చేస్తున్నారు. అదృష్టం కలిసివస్తే మంత్రిగా లేదంటే విప్‌గా, చీఫ్ విప్‌గా కూడా అవకాశం దక్కవచ్చని భావిస్తున్నారు. ఇవేవీ దక్కకున్నా ప్రొటోకాల్ పదవిని అనుభవించవచ్చని ఆశిస్తున్నారు. అందుకే ఓవైపు గ్రాడ్యుయేట్లు, టీచర్ల ఓటర్లపై దృష్టి పెడుతూనే మరోవైపు రాజకీయ పార్టీల మద్దతు కోసం ఆరాటపడుతున్నారు. క్రితంసారి కాంగ్రెస్ మద్దతుతో పట్టభద్రుల ఎమ్మెల్సీగా జీవన్‌రెడ్డి గెలిచారు. మరోసారి ఎమ్మెల్సీగా బరిలో ఉంటారనే ప్రచారం జరుగుతోంది. ఆయనతోపాటు మరికొందరు కాంగ్రెస్ నేతలు ఎమ్మెల్సీ రేసులో ఉన్నారు. ఇక బీఆర్ఎస్, బీజేపీ ముఖ్యనేతలను కూడా కొందరు సంప్రదిస్తున్నారని తెలిసింది. అభ్యర్థిత్వం ఖరారు చేస్తే ఖర్చు ఎంతైనా పెట్టుకుంటామని చెబుతున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రేసులో ఉన్నవారు కూడా పార్టీల మద్దతు కోసం ప్రయత్నిస్తున్నారు.

ఆమెకు భరోసా

- బాధిత మహిళలకు అండగా కేంద్రం
- లైంగిక దాడులకు గురైన వారికి చేయూత
- ఇప్పటి వరకు 269 మంది బాధితులకు భరోసా

సిద్దిపేట క్రైం, ఆగస్టు 23: లైంగిక దాడులు, వేధింపులకు గురైన మహిళలకు భరోసా సెంటర్ అండగా నిలుస్తుంది. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని రూరల్ పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో బాధితులకు భరోసా కల్పించడంతో పాటు వారికి పూర్తి సహాయ సహకారాలను అందిస్తుంది. పోక్సో బాధితులను నేరుగా భరోసా సెంటర్‌కు తీసుకురాగానే సంబంధిత అధికారులు చట్టప్రకారం వారికి వారికి సలహాలను, సూచనలను అందిస్తున్నారు. బాధితులకు ఎవరూ లేకుంటే సిద్దిపేట బాలసదన్‌లో ఆశ్రయం కల్పిస్తున్నారు. పోక్సో, అత్యాచార కేసుల్లో బాధితులకు త్వరగా కాంపెన్సేషన్ ఇప్పించడానికి వివిధ డిపార్ట్‌మెంట్ అధికారులు, సిబ్బంది కృషి చేస్తున్నారు.

269 మంది బాధితులకు భరోసా

భరోసా కేంద్రంలో 212 పోక్సో బాధితులు, 48 అత్యాచార బాధితులు, 9 ఇతర కేసుల బాధితులు కలిపి మొత్తం జిల్లాలో 269 మందికి భరోసా కల్పించారు. భరోసా సెంటర్ సిబ్బంది 119 మంది బాధితుల ఇళ్లను సందర్శించారు. సెంటర్‌కు వచ్చిన వారిలో మానసిక స్థితి బాగాలేని 29 మంది బాధితులను రియాబిటేషన్ సెంటర్‌కు పంపించారు.

మహిళలకు రక్షణగా భరోసా కేంద్రం

- అనురాధ, సీపీ



మహిళలకు రక్షణకు పెద్దపీట వేయడానికి భరోసా కేంద్రం ఏర్పాటు చేశాం. భరోసా సెంటర్ పోక్సో లైంగిక వేధింపులకు గురైన మహిళలకు, బాలికలకు భరోసానిస్తుంది. లైంగిక దాడులకు గురైన బాధితులకు భరోసా కల్పించడంతో పాటు వారికి పూర్తి సహాయ సహకారాలను అందిస్తుంది. బాధిత మహిళలు బాలికలు భరోసా సెంటర్ నెంబర్ 08457-293098, డయల్ 100 నంబర్‌కు ఫోన్ చేసి సహాయ సహకారాలు పొందవచ్చు. ఇప్పటి వరకు జిల్లాల 269 మంది బాధితులకు భరోసా కల్పించాం. 24 మంది మహిళలకు స్వయం ఉపాధి నిమిత్తం శిక్షణ అందించాము.

బాధితులకు జీవనోపాధి

జిల్లాలో ఇప్పటి వరకు భరోసా సెంటర్ ఫండ్ నుంచి 13 మంది బాధితులకు ఆర్థికసహాయం అందించారు. మహిళా పోలీస్‌స్టేషన్, భరోసా సెంటర్ మహిళా సహాయ కేంద్రానికి వచ్చిన మహిళల సాధక బాధకాలు విని వారి ఆర్థిక పరిస్థితిని ఆరా తీసి స్వయం ఉపాధి ద్వారా శిక్షణ ఇపిస్తున్నారు. కుట్టుమిషన్, ఎంబ్రాయిడర్, స్వీట్ ఆధ్వర్యంలో 24 మంది మహిళలకు శిక్షణ ఇప్పించారు. వారి స్వయం ఉపాధికి ప్రభుత్వం ద్వారా తోడ్పాటు అందించారు.



భరోసా సెంటర్ కార్యాలయం

ప్రజలకు అవగాహన

భరోసా కేంద్రం సిబ్బంది గ్రామాల్లో, పట్టణాల్లో భరోసా సెంటర్ అందిస్తున్న సేవలపై అవగాహన కల్పిస్తున్నారు. ఇప్పటివరకు జిల్లాలో 101 అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా పోలీస్‌స్టేషన్లలో నమోదవుతున్న కేసులకు సంబంధించిన డాక్యుమెంట్లు, జిరాక్స్‌లు త్వరితగతిన భరోసా సెంటర్‌కు పంపేలా చర్యలు తీసుకుంటున్నారు.

ఆర్వోఆర్‌పై సూచనలను ప్రభుత్వానికి నివేదిస్తాం

- కలెక్టర్ మనుచౌదరి
- జవాబుదారితనంతో కూడిన వీఆర్వో వ్యవస్థను మళ్లీ ప్రవేశపెట్టాలని విజ్ఞప్తి

7


చర్చావేదికలో పాల్గొన్న వివిధ వర్గాల వారు

ఉద్యోగుల శ్రమను దోపిడీ చేసే సీపీఎస్‌ను రద్దును చేయాలి

7

- తొగుటలో నల్లబ్యాడ్జీలు ధరించి ఉపాధ్యాయుల నిరసన

గోదావరి నీళ్లపైనే ఆశలు

- తపాస్‌పల్లి రిజర్వాయర్‌కు పంపింగ్ చేయాలని డిమాండ్
- వర్షాభావంతో రైతులు ఎదురుచూపులు
- ఇటీవల అధికారులతో మాట్లాడిన కొమ్మూరి
- నీటిపారుదలశాఖ కార్యాలయాల ముట్టడికి ఎమ్మెల్యే పల్లా డెడ్‌లైన్‌పై ఆసక్తి

చేర్యాల, ఆగస్టు 23 : ఇటీవల గోదావరి ఉప్పొంగి ప్రవహించడంతో కొమురవెల్లి మండలంలోని తపాస్‌పల్లి రిజర్వాయర్‌కు గోదావరి జలాల పంపింగ్ కోసం రైతులు వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారు. వానలు లేక భూగర్భజలాలు అడుగంటి కళ్లముందే పంటలు ఎండిపోతుంటే.. చివరికి రైతులు గోదావరి నీళ్లపైనే ఆశలు పెట్టుకున్నారు.


తపాస్‌పల్లి రిజర్వాయర్

దేవాదుల ఎత్తిపోతల పథకం రెండవ దశ ద్వారా 0.03 టీఎంసీల సామర్థ్యంతో కుడికాలువ ద్వారా 48వేల ఎకరాలు, ఎడమకాలువ ద్వారా రూ.19వేల ఎకరాలకు సాగునీటిని అందించేందుకు తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను నిర్మించారు. బీఆర్ఎస్ హయాంలో రెండు పంపుల ద్వారా పంపింగ్ చేసి రిజర్వాయర్‌ను నింపిన అనంతరం కాలువ ద్వారా చెరువులకు నీటిని మళ్లించి కరువు పారదోలారు. కొంతకాలంగా రిజర్వాయర్‌లోకి పంపింగ్ చేయలేదు. ఇటీవల ఎగువ ప్రాంతం నుంచి భారీగా వరద రావడంతో గోదావరి ప్రవహించింది. దీంతో దేవాదుల ఇన్‌టెక్‌వెల్ నుంచి ఎత్తిపోతలు ప్రారంభిస్తారని రైతులు భావించినా ఎలాంటి చర్యలూ చేపట్టకపోవడంతో నిరాశ చెందుతున్నారు. ఇదే విషయమై బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య రాజకీయ వేడి మొదలైంది. పంటలు ఎండిపోతుండడంతో తపాస్‌పల్లి రిజర్వాయర్‌లో పంపింగ్ చేపట్టి కాలువల ద్వారా నీటిని విడుదల చేయించాలని కొమురవెల్లి మండల కాంగ్రెస్ నేతలు ఇటీవల జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి విన్నవించారు. ఆయన నీటిపారుదలశాఖాధికారులతో మాట్లాడి పంపింగ్ త్వరగా చేపట్టాలని సూచించారు. ఇదే విషయాన్ని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించడంపాటు సంబంధిత అధికారులను నీటిని విడుదల చేయాల్సిందిగా కోరారు. అయితే అధికారులు ఎలాంటి చర్యలూ చేపట్టకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. గోదావరిలో నీళ్లునప్పటికీ జాప్యం వహిస్తుండటం తగదని, పంట కాలం పూర్తయ్యాక నీరిస్తారా? అంటూ ఆయన ప్రతీ సమావేశంలోనూ ప్రశ్నిస్తూనే ఉన్నారు. రెండురోజుల్లో తపాస్‌పల్లి, లద్నూరు రిజర్వాయర్లను గోదావరి జలాలతో నింపాలని, లేదంటే నియోజకవర్గ రైతులతో కలిసి నీటిపారుదలశాఖ కార్యాలయాలను ముట్టడిస్తామని ఇటీవల ప్రకటించారు. నేటితో ఆయన పెట్టిన డెడ్‌లైన్ పూర్తవుతుండడంతో రైతులను సమాయత్తం చేసి ప్రభుత్వాన్ని నిలదీసే పనిలో నిమగ్నమయ్యారు. అయితే ఇదే క్రమంలో కాంగ్రెస్ నేతలు సైతం విరుగుడు చర్యలు చేపట్టారు. ఇప్పటికే నియోజకవర్గంలో ప్రొటోకాల్, అభివృద్ధి నిధులు, ఇతరత్రా విషయాలపై ఇరుపార్టీలమధ్య రగడ కొనసాగుతున్న క్రమంలో తపాస్‌పల్లి నీళ్ల గొడవ మరెలాంటి పరిణామాలకు దారితీస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. ఇరుపార్టీలూ రాజకీయ వైరుధ్యాలు వీడి సాగునీటిని అందించి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.


కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి


పల్లా రాజేశ్వర్‌రెడ్డి


రెండేళ్లుగా ఒక్క మొక్కను కూడా నాటని ప్రకృతివనం


మొక్కలు నాటకుండా వదిలేసిన గుంతలు

మొక్క కనపడదు.. లెక్క తేలదు!

- లక్ష్యం ఘనం.. నిర్వహణ శూన్యం
- ఏటా వేలల్లో మొక్కలు.. ఎదగని చెట్లు
- ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు..

దుబ్బాక, ఆగస్టు 23: ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న పథకాలు.. క్షేత్రస్థాయిలో మాత్రం నీరుగారిపోతున్నాయి. హరితహారంలో భాగంగా దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలో మూడేళ్ల నుంచి నాటిన మొక్కల లెక్క ఇప్పటి వరకూ అధికారుల వద్ద లేదంటే వాటి నిర్వహణ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

2022-23లో అప్పటి ప్రభుత్వం దుబ్బాక పురపాలిక పరిధిలో 40వేల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ధేశించింది. అందుకు చెల్లాపూర్‌లో మహిళా సంఘాలు నిర్వహించే నర్సరీ నుంచి మొక్కకు రూ.40చొప్పున కొనుగోలు చేశారు. ఇందులో 25 వేల ఇంటి పెరటి మొక్కలు, 15వేల మొక్కలను పురపాలిక ద్వారా నాటించారు. అందులో సుమారు 33 శాతం మొక్కలు సంరక్షించి అవి పెరిగేలా చూడాలి. ఇప్పటి వరకు ఎన్ని మొక్కలు పెరిగాయో తెలియని పరిస్థితి. 2023-24లో కూడా ఇదే పరిస్థితి. క్రమంగా లక్ష్యం తగ్గుతూ వచ్చింది. 38 వేల మొక్కలకు ఎన్ని నాటారో క్షేత్రస్థాయిలో కనిపించడం లేదు. ఈసారి కూడా 2024-25లో సుమారు 33వేల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్దేశించారు. ప్రస్తుతం 40 శాతం మాత్రమే పూర్తయింది. వర్షాభావ ప్రభావంతో మొక్కలు నాటే కార్యక్రమం పూర్తిచేయలేదని అధికారులు చెబుతున్నారు. అయితే ఈ మూడేళ్లలో మొక్కల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. చాలాచోట్ల ట్రీగార్డులు సక్రమంగా లేవు.




దుబ్బాక పట్టణంలో కోనోకార్పస్ చెట్లు, స్తంభం కింద నాటిన మొక్కలు

అలంకారప్రాయంగా ప్రకృతి వనాలు

దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని 20 వార్డులుండగా 8 వార్డుల్లో ప్రకృతి వనాల ఏర్పాటుకు ఎంపిక చేశారు. ఆర్భాటంగా ప్రకృతి వనాలను ఏర్పాటు చేసినా అవి కాస్త అలంకారప్రాయంగానే మారాయి. పట్టణప్రగతిలో భాగంగా సుమారు రూ.5లక్షల వరకు నిధులు కేటాయించారు. అయినా కూడా చెల్లాపూర్ వార్డులో ఇప్పటి వరకు మొక్కలు నాటలేదు. దుబ్బాకలోని 14 వార్డులో పర్యవేక్షణ లేక మొక్కలు ఎండిపోయాయి. 16 వార్డులో ఇప్పటికీ మొక్కలు నాటలేదు. చాలా చోట్ల మొక్కలు ఎండిపోయాయి.

దుబ్బాక పట్టణంలో 2020-21, 2021-22 మధ్య విరివిగా కోనోకార్పస్ మొక్కలు నాటారు. సుమారు 80 వేల మొక్కలు నాటినట్లు సమాచారం. ఆ మొక్కలు ప్రమాదకరం కావడంతో వాటిని తొలగించి వాటి స్థానంలో మంచి మొక్కలు నాటాలని దుబ్బాక ప్రజలు కోరుతున్నారు.


నిర్లక్ష్యంగా వదిలేసిన ట్రీగార్డు

క్యూఆర్టీ టీమ్స్ అప్రమత్తంగా ఉండాలి

- సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ


సమావేశంలో మాట్లాడుతున్న సీపీ అనురాధ

సిద్దిపేట క్రైం, ఆగస్టు 23 : క్యూఆర్టీ (క్విక్ రియాక్షన్ టీమ్స్) అప్రమత్తంగా ఉండాలని సీపీ అనురాధ అన్నారు. క్యూఆర్టీ నిర్వహించాల్సిన విధుల గురించి కమిషనర్ కార్యాలయంలో సీపీ సమీక్ష నిర్వహించి మాట్లాడారు. శాంతిభద్రతల విషయంలో, ధర్నా లు, రాస్తారోకోలు జరిగినప్పుడు త్వరగా రియాక్ట్ కావాలని సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం వహించకూడదని చెప్పారు. జిల్లాలో ఎక్కడ ఏదైనా సంఘటన జరిగిన వెంటనే క్యూఆర్టీ టీమ్స్ అక్కడికి చేరుకోవాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహించే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంకితభావంతో విధులు నిర్వహించే అధికారులు సిబ్బందిని గుర్తించి ప్రతి నెలా రివార్డులు అవార్డులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ డీసీపీలు రామచంద్రరావు, సుభాష్ చంద్రబోస్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ కిరణ్, వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీబాబు, టూటౌన్ ఇన్‌స్పెక్టర్ ఉపేందర్, త్రీటౌన్ ఇన్‌స్పెక్టర్ విద్యాసాగర్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు ధరణి కుమార్, పూర్ణచందర్, రాజేష్, ఆర్ఎస్ఐ వెంకటరమణ, రంజిత్, క్యూఆర్టీ సిబ్బంది పాల్గొన్నారు.

బోడ కాకరకు బోరెడు డిమాండ్

- హాట్‌కేక్‌లా అమ్ముడవుతున్న కూరగాయ
- కిలో రూ.250 వరకు విక్రయం

7



పాస్‌బుక్ తనఖా లేకుండా రుణాలు

డీసీసీబీ మేనేజర్ కిషన్ జాదవ్

పాపన్నపేట, ఆగస్టు 23: పట్టాదారు పాస్‌బుక్ తనఖా లేకుండానే రైతులకు రుణాలు ఇస్తామని పాపన్నపేట డీసీసీబీ మేనేజర్ కిషన్‌జాదవ్ ప్రకటించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రూ.1.60 లక్షల రుణం వరకు మార్టిగేజ్ చేసుకోబోమన్నారు. కేవలం ధరణి చార్జి క్రియేషన్ చేసి రుణం ఇస్తామని చెప్పారు. అసైన్డ్ భూములకు కూడా రుణాలు ఇస్తామని తెలిపారు. రైతు నేస్తం పథకం ద్వారా ఎకరానికి రూ.2 లక్షల రుణం అందిస్తామన్నారు. లాంగ్‌టర్మ్ లోన్ కింద ఎకరానికి రూ.4 లక్షల చొప్పున పౌల్ట్రీ, డెయిరీ, షీప్ ఫామ్‌లకు రుణాలు ఇస్తామని తెలిపారు. తమ బ్యాంకు పరిధిలో రూ.5.50 కోట్ల రుణాలు మాఫీ కాగా, ఇప్పటివరకు రూ.4.50 కోట్లు తిరిగి రుణాలుగా ఇచ్చామన్నారు. రైతులు వెంటనే బ్యాంక్‌కు వచ్చి రుణాలు తీసుకోవాలని కోరారు. డిపాజిట్లపై ఇతర బ్యాంక్‌ల కన్నా ఎక్కువ వడ్డీ ఇస్తామన్నారు. ఏడేళ్ల తర్వాత చీకోడ్ సొసైటీ పరిధిలో ఎల్‌టీ లోన్లు ఇచ్చినట్లు చెప్పారు. ఆయన వెంట చీకోడ్ సొసైటీ ఛైర్మన్ దత్తరాజ్ ఉన్నారు.

స్త్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

-జిల్లా అదనపు డీఆర్డీవో సరస్వతి



సమావేశంలో మాట్లాడుతున్నఅదనపు డీఆర్డీవో సరస్వతి

మనోహరాబాద్, ఆగస్టు 23: మహిళలు స్త్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు డీఆర్డీవో సరస్వతి అన్నారు. శుక్రవారం మనోహరాబాద్‌లోని సమైక్య కార్యాలయంలో సీసీలతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. మహిళలు రుణాలు పొంది ఆర్థికంగా ఎదగాలన్నారు. సకాలంలో రుణాలు చెల్లించే విధంగా చూడాలని, మహిళలు సీఐఎఫ్ ద్వారా రుణాలు తీసుకునే విధంగా వారికి సహకరించాలని కోరారు. తీసుకున్న రుణాలు వివరాలు ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేయాలని కోరారు. అనంతరం మండలంలో రుణాలు పొందిన మహిళల షాపులను తనిఖీ చేశారు. సమావేశంలో ఏపీఎం పెంటాగౌడ్, సీసీలు కృష్ణవేణి, మంజుల, విజయలక్ష్మి పాల్గొన్నారు.

భూగర్భ జలాల పెంపునకు కృషి చేయాలి

డీఆర్డీవో పీడీ శ్రీనివాసరావు

వెల్దుర్తి, ఆగస్టు 23 : అన్ని గ్రామాల్లో నీటి నిల్వ గుంతలు ఏర్పాటు చేసి భూగర్భ జలాల పెంపు కోసం కృషి చేయాలని డీఆర్డీవో పీడీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం వెల్దుర్తి మండల పరిషత్ సమావేశ మందిరంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తప్పకుండా ప్రతి గ్రామంలో 2 ఎకరాల మేర పండ్ల తోటలు సాగు చేయాలని సూచించారు. అంతకుముందు వెల్దుర్తి మండల సమైక్య కార్యాలయంలో ఏపీఎం శంకరయ్యతో కలిసి వీవోఏ, సీసీలతో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు లింకేజ్, స్త్రీనిధి, మైక్రో ఎంటర్‌ప్రైజెస్, బ్యాక్ యాడ్ పౌల్ట్రీ, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్స్ తదితర అంశాలపై చర్చించారు.

రైతులను విస్మరించిన బీఆర్ఎస్



గుమ్మడిదలలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

గుమ్మడిదల, ఆగస్టు 23 : గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులను విస్మరిస్తే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఇచ్చిన హామీ మేరకు రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేసి చూపించిందని రాష్ట్ర పీసీసీ కార్యవర్గ సభ్యుడు కొత్తపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు పుట్ట నర్సింగరావు, వడ్డే కృష్ణ, మాజీ మండల అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, మద్ది వీరారెడ్డి, మాజీ ఎంపీటీసీ సురభి నాగేందర్‌గౌడ్, మండల నాయకులు మద్ది ప్రతాపరెడ్డి, నరేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. గుమ్మడిదలలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కేవలం రాజకీయ ఉనికి కోసమే బీఆర్ఎస్ పార్టీ నాయకులు రైతుల పేరుతో ధర్నాలు చేస్తూ కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. రైతు రుణమాఫీ చేయలేదని బీఆర్ఎస్ నాయకులు నియోజకవర్గ స్థాయిలో గుమ్మడిదలలో ధర్నా పెట్టడాన్ని తీవ్రంగా ఖండించారు. కొన్ని టెక్నికల్ ప్రాబ్లం వల్ల కొందరికి రుణమాఫీ కాకపోవచ్చు అన్నారు. రైతులు అధైర్య పడొద్దని రుణమాఫీ పూర్తి స్థాయిలో జరిగే విధంగా సహకరిస్తామని భరోసా ఇచ్చారు. రుణమాఫీపై హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ నేతలు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తులసీదాసు, నాయకులు లక్ష్మారెడ్డి, పెంటారెడ్డి, నరసింహులు, యాదగిరి, దయాకర్ రెడ్డి, జంగారెడ్డి, అంజాద్ భాష, జైపాల్‌రెడ్డి, ఆకుల ఆంజనేయులు, కవ్వం రవీందర్‌రెడ్డి, రాజిరెడ్డి, విప్ప భూపతిరెడ్డి, విప్ప రామ్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

వాచ్‌మన్‌పై విద్యార్థుల రాళ్ల దాడి

● స్వల్ప గాయాలు.. తప్పించుకున్న ఉపాధ్యాయులు



రాళ్ల రువ్వడంతో గాయపడిన వాచ్‌మన్ వెంకటయ్య

కౌడిపల్లి, ఆగస్టు 23: ఆకతాయి విద్యార్థులు రాత్రివేళలో వాచ్‌మన్‌తో పాటు ఉపాధ్యాయులపై రాళ్లు విసిరిన సంఘటన మండల పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే.. మండల పరిధిలోని తునికిలోని మహాత్మ జ్యోతిబా పూలే(ఎంజేపీ) గురుకుల పాఠశాలలో విద్యార్థులకు రాత్రివేళల్లో ఇబ్బందులు ఉండకూడద ని గురువారం రాత్రి వాచ్‌మన్ వెంకటయ్యతో కలసి ఉపాధ్యాయులు విద్యుత్ దీపాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇది గమనించిన కొంతమంది డిగ్రీ, ఇంటర్ చదువుతున్న విద్యార్థులు చెట్ల చాటు నుంచి రాళ్లను విసిరారు. వెంటనే ఉపాధ్యాయులు, వాచ్‌మన్ వెంకటయ్య అక్కడి నుంచి తప్పించుకునేందుకు యత్నించారు. ఈ క్రమంలో వాచ్‌మెన్‌కు ముఖానికి, వీపుకు స్వల్ప గాయలు అయ్యాయి. శుక్రవారం ఉదయం వాచ్‌మెన్ స్థానిక ఆర్ఎంపీ వైద్యుని వద్దకు వెళ్లి చికిత్స చేయించుకున్నారు. పాఠశాల ఆవరణలో వీధి దీపాలు ఏర్పాటు చేస్తే విద్యార్థులు గోడ దూకి బయటకు వెళ్లే సమయంలో కనిపిస్తామని, కొంత మంది ధూమపానంతో పాటు ఇతర వ్యసనాలకు అలవాటుపడ్డారని, దొరికిపోతామని రాళ్లతో దాడికి పాల్పడి ఉంటారని వాచ్‌మన్ అనుమానం వ్యక్తం చేశారు. ఇదే విషయంపై ప్రిన్సిపాల్ హరిబాబును వివరణ కోరగా తమ పాఠశాలలో అలాంటిదేమీ జరగలేదని, తన దృష్టికి సమస్య రాలేదని దాటవేశారు.

బైక్‌పై శుభకార్యానికి వెళ్లి వస్తూ..

చెట్టును ఢీకొని ఒకరి మృతి



చెట్టుకు ఢీకొన్న ద్విచక్రవాహనం, పక్కనే మృతుడు స్వామి

గజ్వేల్, ఆగస్టు 23 : శుభకార్యానికి వెళ్లి వస్తూ బైక్ చెట్టును ఢీకొనడంతో ఒకరు మృతిచెందిన సంఘటన గురువారం రాత్రి చోటుచేసుకున్నది. గజ్వేల్ మండలం ప్రజ్ఞాపూర్ గ్రామానికి చెందిన శేరుపల్లి స్వామి(40) మిరుదొడ్డి మండలం కాసులాబాద్ గ్రామంలో శుభకార్యానికి తన ద్విచక్రవాహనంపై వెళ్లాడు. గురువారం రాత్రి తిరిగి తన స్వగ్రామం ప్రజ్ఞాపూర్‌కు వస్తుంటే గజ్వేల్ మండలం కొల్గూరు వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి చెట్టుకు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో స్వామి అక్కడికక్కడే మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. స్వామి భార్య శేరుపల్లి రజిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ బి.సైదా తెలిపారు. మృతదేహాన్ని గజ్వేల్ ఏరియా ఆసుపత్రికి తరలించి, శవపరీక్షల అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు.

గంజాయి తాగి పట్టుబడిన ఇద్దరు యువకులు

ములుగు, ఆగస్టు 23: గంజాయి తాగి ఇద్దరు పట్టుబడిన ఘటన గురువారం రాత్రి ములుగు పరిధిలో చోటుచేసుకున్నది. గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం రాత్రి ములుగులో ఆసుపత్రి వెనుక వైపు కోళ్లఫారం వద్ద స్వామి, సురేశ్ అనుమానంగా కనిపించడంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్న ఇద్దరికి నార్కోటిక్ టెస్ట్ చేయగా వారు గంజాయి తాగినట్లు తేలింది. వారిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. గంజాయి తాగి పట్టుబడినట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ మహేందర్‌రెడ్డి హెచ్చరించారు. ఆయన వెంట ఎస్ఐ విజయ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

దొంగల హల్‌చల్..

నిలిపి ఉంచిన కారు టైర్లు చోరీ



టైర్లు దొంగతనం చేసిన కారు

నిజాంపేట, ఆగస్టు 23 : పార్కింగ్ చేసిన వాహనాల టైర్లు చోరీ చేసిన సంఘటన నిజాంపేట మండల కేంద్రంలో చోటుచేసుకున్నది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలో చేర్వీరాల సురేష్, పంజా మహేందర్, గడ్డం శ్రీనివాస్‌కు చెందిన మూడు కార్లను వారి ఇంటి వద్ద పార్కింగ్‌కు స్థలం లేకపోవడంతో గాంధీ విగ్రహం సమీపంలో, అలాగే రహదారి పక్కన నిలిపారు. ఎప్పటిలాగే ఉదయం వాహనాల వద్దకు వచ్చి చూసేసరికి కార్ టైర్ల స్థానంలో రాళ్లు ఉంచి టైర్లలను ఎత్తుకెళ్లడంతో కంగుతిన్నారు. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసి క్లూస్ టీం ద్వారా పరిశీలించి దర్యాప్తు చేపడుతున్నట్లు ఏఎస్ఐ జైపాల్‌రెడ్డి తెలిపారు.

వర్షాలకు కూలిన ఇంటిపైకప్పు

● ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడి వేడుకోలు

నిజాంపేట, ఆగస్టు 23 : ఇటీవల కురిసిన వర్షాలకు ఇంటిపై కప్పు కూలిపోవడంతో ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు శుక్రవారం అధికారులకు మొరపెట్టుకున్నారు. బాధితులు తెలిపిన ప్రకారం.. రెండు, మూడు రోజుల పాటు వేళలో కురుస్తున్న వర్షాల కారణంగా మండల పరిధిలోని రాంపూర్ గ్రామానికి చెందిన కేశవుల స్వామి ఇంటిపై కప్పు గురువారం రాత్రి ఒక్కసారిగా కుప్పకూలింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఈ విషయాన్ని బాధితులు శుక్రవారం స్థానిక తహసీల్దార్‌కు తెలపగా పరిశీలించి పైఅధికారులకు తెలుపుతామన్నారు. తమది నిరుపేద కుటుంబమని, ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు.

ఎనిమిది నెలల తర్వాత..

తల్లిదండ్రుల చెంతకు దివ్యాంగుడు

శివ్వంపేట, ఆగస్టు 23 : ఎనిమిది నెలల క్రితం పెదనాన్న ఇంటికి వచ్చి తప్పిపోయిన మానసిక దివ్యాంగుడిని పోలీసులు ఆశ్రమంలో చేర్పించగా ఆపరేషన్ ముస్కాన్ ద్వారా ఎనిమిది నెలల తర్వాత తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు పట్టణానికి చెందిన మెరుగు గాడ్సన్ జామవా మొదటి కుమారుడు బ్లెస్సెన్ రాజు ఈ ఏడాది జనవరిలో హైదరాబాద్ గాంధీనగర్‌లో ఉండే వాళ్ల పెదనాన్న ఇంటికి వచ్చాడు. బ్లెస్సెన్ రాజు జనవరి చివరి వారంలో తప్పిపోగా ఫిబ్రవరి 2వ తేదీన తూప్రాన్ పోలీసులకు దొరికాడు. తూప్రాన్ పోలీసులు శివ్వంపేట మండలం బేతాని సంరక్షణ అనాథ ఆశ్రమంలో ఆ బాలుడిని చేర్పించారు. కాగా పోలీసులు నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంలో భాగంగా దర్పన్ యాప్‌లో బాలుడి వివరాలను నమోదు చేశారు. తల్లిదండ్రులు గుర్తించడంతో 8 నెలల తర్వాత బాలుడిని క్షేమంగా తూప్రాన్ ఎస్ఐ శివనాదం సమక్షంలో ఆశ్రమ నిర్వాహకులు ఫాదర్ సాజీ వర్గీస్, ఆశ్రమ క్యాంపస్ ఇన్‌చార్జి విన్సెంట్, సోషల్ వర్కర్ వీర బాబు, హోం ఇన్‌చార్జీ సిస్టర్ కార్మెల్ తల్లిదండ్రులకు అప్పగించారు.

అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యం పట్టివేత



పోలీసులు పట్టుకున్న పీడీఎస్ బియ్యం

మిరుదొడ్డి, ఆగస్టు 23 : అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకుని స్థానిక పోలీస్‌స్టేషన్ తరలించినట్లు అక్బర్‌పేట-భూంపల్లి ఎస్ఐ హరీష్ తెలిపారు. శుక్రవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. దుబ్బాక మండలం పెద్దచీకోడ్ గ్రామానికి చెందిన పర్వతం యాదగిరి పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారనే నమ్మదిగిన సమాచారంతో పోలీస్‌స్టేషన్ ఎదుట శుక్రవారం తెల్లవారుజామున వాహనాలను తనిఖీ చేపట్టారు. బొలెరో వాహనంలో తరలిస్తున్న 49 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బోడ కాకరకు బోలెడు డిమాండ్



మార్కెట్‌లో బోడ కాకర



● హాట్‌కేక్‌లా అమ్ముడవుతున్న కూరగాయ
● కిలో రూ.250 వరకు విక్రయం



హుస్నాబాద్‌రూరల్, ఆగస్టు 23 : వర్షాకాలంలో మాత్రమే లభించే కూరగాయల్లో బోడ(అడవి) కాకర ఒకటి. అడవుల్లో, గుట్ట ప్రాంతాలు, వాగులు, చెరువు గట్ల వెంట ఎక్కువగా లభించే వీటిల్లో ఔషధగుణాలతో పాటు పోషక విలువలు అధికంగా ఉంటాయి. వర్షాకాలంలో మాత్రమే లభించే బోడ కాకరను తినేందుకు మహా ఇష్టపడతారు. గ్రామాల్లో బోడ కాకర ఉత్పత్తి తగ్గిపోవడంతో ప్రస్తుతం మార్కెట్‌లో డిమాండ్ పెరిగింది. మరి ఇంకా శ్రావణ మాసంలో బోడకాకర కూరకు డిమాండ్ బాగా పెరిగింది. మార్కెట్‌లోకి తీసుకు రావడమే ఆలస్యం వినియోగదారులు ఎగబడి కొంటున్నారు. కిలో రూ.200 నుంచి 250 వరకు విక్రయిస్తున్నారు.



హుస్నాబాద్ సంతలో బోడ కాకర విక్రయం

హైదరాబాద్ టూ హుస్నాబాద్‌కు దిగుమతి



గ్రామీణ ప్రాంతాల్లో బోడకాకర కనుమరుగైపోతుండడంతో ప్రత్యామ్నాయంగా హైదరాబాద్ నుంచి సీడ్ వంగడం బోడ కాకరకాయ హుస్నాబాద్‌కు దిగుమతి అవుతోంది. దీనిపై వినియోగదారులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. అదే లోకల్ బోడకాకరకాయ కోసం వినియోగదారులు ఎగబడుతున్నారు. గిరిజన తండాల నుంచి తెచ్చే బోడకాకర హాట్‌కేక్‌లా అమ్ముడు పోతున్నది.

- నేతి రవీందర్, కూరగాయల అమ్మకందారుడు, హుస్నాబాద్

గ్రామాల్లో అంతరిస్తున్న బోడ కాకర

గ్రామీణ ప్రాంతాల్లో సహజసిద్ధంగా దొరికే బోడ కాకర ప్రస్తుతం అంతరించిపోతుంది. ఒకప్పుడు బోడ కాకరను గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు తీసుకెళ్లి అమ్మేవారు. కానీ, ప్రస్తుతం పట్టణాల నుంచి పల్లెలకు బోడ కాకర దిగుమతి అవుతున్నది. అడవుల విస్తీర్ణం తగ్గిపోవడం, చెరువులు, కుంటల మరమ్మతుతో చెట్లు అంతరించిపోయి గ్రామాల్లో బోడ కాకర ఉత్పత్తి తగ్గిపోయింది. గ్రామాల్లో ఎక్కడో ఒక చోట లభించే బోడ కాకరను సేకరించి మార్కెట్లకు తరలిస్తే అరగంటలో అమ్ముడవుతున్నది. హుస్నాబాద్ డివిజన్‌లోని అక్కన్నపేట, కోహెడ, హుస్నాబాద్ చుట్టుపక్కల ఉన్న గిరిజన తండాల్లో ఎక్కువగా లభిస్తాయి. కొందరు గిరిజనులు వీటిని కోసి ప్రతీ శుక్రవారం హుస్నాబాద్‌లో నిర్వహించే సంతకు తెస్తారు. సంతలో హాట్‌కేక్‌ల్లా అమ్ముడవుతున్నాయి.



సహజ సిద్ధంగా అడవిలో పెరిగిన బోడ కాకరకాయ తీగ

ఆర్వోఆర్‌పై సూచనలను ప్రభుత్వానికి నివేదిస్తాం

● సిద్దిపేట కలెక్టర్ మను చౌదరి
● జవాబుదారితనంతో కూడిన వీఆర్‌వో వ్యవస్థను మళ్లీ ప్రవేశపెట్టాలని విజ్ఞప్తి



మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట కలెక్టరేట్, ఆగస్టు 23 : తెలంగాణ నూతన ఆర్వోఆర్(రికార్డ్ ఆఫ్ రైట్) 2024 ముసాయిదా బిల్లుపై అవగాహన కల్పించి సలహాలు, సూచనలు తీసుకున్నామని సిద్దిపేట కలెక్టర్ మను చౌదరి తెలిపారు. వీటిని రికార్డు చేశామని, ఆ వివరాలను ప్రభుత్వానికి అందజేస్తామని ఆయన తెలిపారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన ఆర్వోఆర్ 2024 ముసాయిదా బిల్లుపై చర్చవేదిక నిర్వహించారు. ముందుగా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, దుబ్బాక తహసీల్దార్ వెంకటరెడ్డి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నూతన ముసాయిదా బిల్లులోని 20 అంశాలను వివరించారు. ఈ సందర్భంగా అడ్వకేట్లు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజలు, జర్నలిస్టులు, ట్రెసా (తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్) ప్రతినిధులు మాట్లాడారు. కొత్త చట్టంలో భూ రికార్డులు ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లోనూ ఉంచాలని, రైతు కుటుంబం కోరారు. లీగల్ విల్ డీడ్ చేసినప్పుడు దానినే ప్రామాణికంగా చేసుకొని రిజిస్ట్రేషన్ చేయాలని, ప్రైవేటు భూములతో పాటు ప్రభుత్వ భూములకు, దేవాదాయ భూములకు కూడా కాస్తుదారు ఉండాలని, రెవెన్యూ అధికారులు వివిధ పనులతో బిజీగా ఉంటారు కాబట్టి భూముల రిజిస్ట్రేషన్ వ్యవహారాలు సబ్ రిజిస్ట్రార్ల ద్వారా మాత్రమే జరిగేలా చూడాలని సూచించారు. సవరణ రిజిస్టర్ ప్రజలకు అందుబాటులో ఉంచాలని, హిడెన్ ఫైల్స్ ఉండరాదని, ధరణిలో జరిగిన పొరపాట్లను ఆర్డీవో ద్వారా పరిశీలించి సరి చేసే అధికారం కల్పించాలని పలువురు సూచించారు. భూ సమస్యల శాశ్వత పరిష్కార వేదికను జిల్లాస్థాయిలో ఏర్పాటు చేయాలని కోరారు. జవాబుదారీతనంతో కూడిన వీఆర్వో వ్యవస్థను మళ్లీ ప్రవేశపెట్టాలని వారు కోరారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ రికార్డులపై అజమాయిషీ తహసీల్దార్ వద్దనే ఉండాలని, రికార్డ్స్ కరెక్షన్ ఆప్షన్ ఆర్డీవోకు ఇవ్వాలని, విల్ డీడ్ చేసినప్పుడు సాక్షులను విచారించి రిజిస్ట్రేషన్ చేయాలని తెలిపారు. మున్సిపల్ ప్రాంతాల్లో నాలాలు చెరువులు కబ్జాకు గురికాకుండా ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ మ్యాపులు రూపొందించాలని, అప్పీల్ అధికారాలు ఆర్డీవోకు, అదనపు కలెక్టర్‌కి పెట్టాలని, రెవెన్యూ కోర్టులకు బదులుగా రిటైర్డ్ జడ్జిలు లేదా రిటైర్డ్ కలెక్టర్లు లేదా రిటైర్డ్ జాయింట్ కలెక్టర్లతో ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని కోరారు. ఆర్వోఆర్ యాక్టును ధరణి రిఫరెన్స్‌కు బదులుగా 2017 రికార్డు ప్రకారం రూపొందించాలని, వివాదాస్పద అంశాలను నిర్దీత సమయంలోనే పరిష్కరించాలని, ఇప్పుడున్న సాదాబైనామా కేసులను ఆరు నెలల్లో పరిష్కరించి కొత్తవి జరగకుండా చూడాలని సూచించారు. ఎన్ఐసీ ద్వారా ఆర్వోఆర్ చట్టాన్ని అమలు చేయాలనే తదితర, సలహాలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్ ఆర్డీవోలు సదానందం, బన్సీలాల్, రామ్మూర్తి, కలెక్టరేట్ ఏవో రెహమాన్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, బార్ అసోసియేషన్ సభ్యులు, ట్రెసా సభ్యులు, జర్నలిస్టులు, ప్రజలు, రెవెన్యూ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పన్నులు పెంచితే సహించేది లేదు

● పౌరసేవలకు ఇబ్బందులు రాకుండా చూడాలి
● అభిప్రాయం వ్యక్తపరిచిన పటేల్‌గూడ, కిష్టారెడ్డిపేట గ్రామస్థులు
● మున్సిపాలిటీలో విలీనంపై ప్రజాభిప్రాయ సేకరణ



కిష్టారెడ్డిపేట గ్రామంలో ప్రజాభిప్రాయం సేకరిస్తున్న అధికారులు

పటాన్‌చెరు, ఆగస్టు 23 : గ్రామాలను మున్సిపాలిటీల్లో విలీనం చేసి, పన్నులు పెంచుతామంటే సహించేది లేదని గ్రామ పంచాయతీలోని ప్రజలు తేల్చిచెప్పారు. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని పలు గ్రామ పంచాయతీలను పక్కనే ఉన్న అమీన్‌పూర్ మున్సిపాలిటీలో విలీనం చేయడంపై జిల్లా పంచాయతీరాజ్ అధికారులు ఆయా గ్రామాల్లో గ్రామసభలను నిర్వహిస్తున్నారు. శుక్రవారం మండల పరిధిలోని పటేల్‌గూడ, కిష్టారెడ్డిపేట తదితర గ్రామ పంచాయతీల్లో గ్రామసభలను నిర్వహించి ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. మాజీ ప్రజాప్రతినిధులు, పలు పార్టీల నాయకులు, ఆయా కాలనీల సంక్షేమ సంఘాల నాయకులు, యువత సభల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఇంకా కొన్ని రోజులు పంచాయతీలుగానే కొనసాగించి మౌలిక వసతులు అభివృద్ధి పరచాలని కోరారు. కాగా కొందరు మాత్రం పంచాయతీని అప్‌గ్రేడ్ చేసి మున్సిపాలిటీలో విలీనం చేస్తే నిధులు పెద్దఎత్తున రావడం ద్వారా అభివృద్ధి వేగవంతం అవుతుందన్నారు. మున్సిపాలిటీగా మారినా పౌరసేవలకు ఇబ్బందులు రాకుండా చూడాలని, గ్రామంలో వార్డు కార్యాలయం ఏర్పాటు చేసి ఇక్కడే సేవలు అందించాలని కోరారు. గ్రామ సభల తీర్మానాలు, అభ్యంతరాలను కలెక్టర్‌కు నివేదిస్తామని పంచాయతీ ప్రత్యేకాధికారులు, ఈవోలు హామీ ఇచ్చారు.

ప్రైవేటు ఆస్పత్రుల్లో తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్యం అందించాలి

● మెదక్ డీఎంహెచ్‌వో శ్రీరామ్

మెదక్ కల్చరల్, ఆగస్టు 23 : పేదల ప్రజలపై ఆర్థిక భారం పడకుండా, తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్య సేవలను అందించాలని జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యులతో డీఎంహెచ్‌వో శ్రీరామ్ సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రైవేటు ఆస్పత్రి వైద్యులతో శుక్రవారం డీఎంహెచ్‌వో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రుల్లో ప్రతీ ఒక్కరు వివరాలతో కూడిన బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. డెంగ్యూ పరీక్షలలో ఎన్ఎస్ వన్ పాజిటివ్ వస్తే టీ హబ్‌లో ఎలిసా టెస్ట్ చేయించి నిర్ధారించాలని అన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే, అనుమతులు లేకుండా ఆస్పత్రులు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకొని హాస్పిటల్‌ను సీజ్ చేస్తామని హెచ్చరించారు. స్కానింగ్ వివరాలు ఎప్పటికప్పుడు పంపించాలని అన్నారు. ఈ సమావేశంలో ప్రోగ్రాం ఆఫీసర్ నవీన్‌కుమార్, డెమో శ్రీనివాస్, రమ, ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యులు పాల్గొన్నారు.



వైద్యులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

ఉద్యోగుల శ్రమను దోపిడీ చేసే సీపీఎస్‌ను రద్దును చేయాలి



గజ్వేల్ ఐవోసీ కార్యాలయంలో జీవో నంబర్ 28 ప్రతులను దహనం చేస్తున్న సీపీఎస్ ఉద్యోగులు

● తొగుటలో నల్లబ్యాడ్జీలు ధరించి వివిధ సంఘాల ఉపాధ్యాయుల నిరసన

తొగుట, ఆగస్టు 23 : ఉద్యోగ, ఉపాధ్యాయుల శ్రమను దోపిడీ చేస్తూ తీసుకొచ్చిన సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, వెంటనే ఓపీఎస్ పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం తొగుట ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు తన మేనిఫెస్టోలో సీపీఎస్ రద్దు చేసి, ఓపీఎస్‌ను అమల్లోకి తెస్తామని ప్రకటించిందని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలైనా ఇప్పటివరకు ఎలాంటి కార్యాచరణను చేపట్టకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉద్యోగుల న్యాయమైన డిమాండ్‌లను వెంటనే అమలుచేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తొగుట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపేందర్, ఉపాధ్యాయులు మల్లేశం, భగవాన్, శ్రీపాల్, శ్రీనివాస్, రాములు, అన్నపూర్ణ, అనురాధ, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

జీవో 28 ప్రతులను దహనం

గజ్వేల్, ఆగస్టు 23 : ఉద్యోగుల పాతపెన్షన్ విధానాన్ని కాలరాసి జీవో నంబర్ 28ను అమలులోకి తీసుకొచ్చి నూతన పెన్షన్ స్కీంకు శ్రీకారం చుట్టిన ఆగస్టు 23 బ్లాక్ డే అని ఉద్యోగ సంఘాల నాయకులు అన్నారు. గజ్వేల్ పట్టణంలోని ఐవోసీ కార్యాలయంలో జీవో 28 ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఎస్ ఈయూ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మల్లికార్జున్, జిల్లా ఉపాధ్యక్షుడు వై.రాజు మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్ని వెంటనే అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మండల అధ్యక్షుడు షేక్ బిలాల్, కమలాకర్, లవకుమార్, మల్లేశం, అశ్రఫ్, ఉపేంద్రం నరేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుల బహిష్కరణ ఘటనలో పలువురి

పెద్ద మనుషులపై కేసు నమోదు

దుబ్బాక/మిరుదొడ్డి, ఆగస్టు 23 : అక్బర్‌పేట-భూంపల్లి మండలం బొప్పాపూర్ గ్రామానికి చెందిన బండమీది సాయిలు మృతదేహానికి కుల బహిష్కరణ చేసిన విషయం తెలిసిందే. శుక్రవారం బండమీది పోశవ్వ భూంపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గవ్వల చంద్రయ్య, కొనాపురం శ్రీనివాస్, మారి చంద్రయ్య, గవ్వల పెంటయ్య, ఎనగుర్తి పద్మయ్య, దుంపలపల్లి స్వామిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

శిథిలావస్థలో గిరిజన గురుకులం

● పాతబడిన భవనంలోనే తరగతులు
● భయంభయంగా చదువుతున్న విద్యార్థులు

నర్సాపూర్, ఆగస్టు 23 : గిరిజనులకు నాణ్యమైన విద్య అందించాలనే ఉద్దేశంతో 30 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన గిరిజన గురుకుల విద్యాలయం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. కూలుతున్న పాత భవనంలోనే తరగతులు కొనసాగుతుండడంతో విద్యార్థులు భయంభయంగా విద్యనభ్యసిస్తున్నారు. ఇదీ నర్సాపూర్ మండలం మహ్మదాబాద్ గిరిజన ఆశ్రమ పాఠశాల దుస్థితి. ఈ పాఠశాలలో 3వ తరగతి నుంచి పదోతరగతి వరకు కొనసాగుతున్నది. విద్యాలయంలో సంగారెడ్డి, మెదక్ జిల్లాలోని గిరిజన విద్యార్థులు 167 మంది ఉన్నారు. ఈ గిరిజన పాఠశాల మండలంలోని ఓ మారుమూల ప్రాంతంలో ఉండటంతో అటు ప్రజాప్రతినిధులు ఇటు అధికారులు పట్టించుకోకపోవడంతో దాని పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది.





తలుపులు, కిటికీలు లేని తరగతి గది

ఎప్పుడు కూలుతుందో..

30 ఏళ్ల క్రితం విద్యార్థులు చదువుకోవడానికి తరగతి గదులతో ఓ భవనాన్ని, నివాసముండటానికి డార్మెంటరీ హాలును నిర్మించారు. ఈ రెండు భవనాలు ఐదేళ్ల క్రితమే శిథిలావస్థకు చేరింది. నాలుగేళ్ల క్రితం కొత్తగా హాస్టల్ భవనం, భోజనం చేయడానికి ఓ గది నిర్మించారు. తరగతి గదులను మాత్రం నిర్మించలేదు. బోధనకు పాతబడిన భవనమే దిక్కైంది. పైకప్పు పెచ్చులూడుతూ కిటికీలు, తలుపులు కూడా లేని అధ్వానమైన గదులలోనే విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ చదువు సాగిస్తున్నారు. కిటికీలు ఊడిపోయి గోడ కూలి పెద్దపెద్ద రంధ్రాలు ఏర్పడ్డ పట్టించుకునే నాథుడే లేదు.





మహ్మదాబాద్ గిరిజన విద్యాలయం, పెచ్చులూడుతున్న భవనం

ఒక్క రెగ్యులర్ ఉపాధ్యాయుడు లేరు

ఈ గిరిజన పాఠశాలలో మొత్తం 11 మంది ఉపాధ్యాయులు ఉండగా అందులో పది మంది విద్యావలంటీర్లుగా పనిచేస్తున్న వారే. హెచ్ఎం కూడా కాంట్రాక్ట్ ఉద్యోగి. అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించినా ఎవరూ దీనిపై దృష్టి పెట్టకపోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

పనులను నాణ్యతతో చేపట్టాలి

● గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కమిషనర్

గజ్వేల్, ఆగస్టు 23: పనులను నాణ్యతతో చేపట్టాలని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్య అన్నారు. గజ్వేల్ పట్టణంలోని 18వ వార్డులో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనులను నాణ్యతతో, వేగంగా చేపట్టాలని సూచించారు. అనంతరం 4వ వార్డు పరిధిలోని ఓ షోరూం వద్ద ఉన్న పిచ్చి చెట్లను జేసీబీ సహాయంతో తొలగింపజేశారు. ఆయనవెంట మునిసిపల్ ఏఈ శ్రీధర్‌రెడ్డి, ఇతర సిబ్బంది ఉన్నారు.

గ్రామీణ ప్రాంతాలకు వైద్యం దూరం

● అసంపూర్తిగా ఆరోగ్య ఉపకేంద్రాలు

● నిధులున్నా ముందుకు సాగని పనులు



ధర్మారంలో అసంపూర్తిగా ఆరోగ్యఉపకేంద్రం, (ఇన్‌సెట్‌లో) ఉపకేంద్రంలో చెత్తాచెదారం

మిరుదొడ్డి, ఆగస్టు 23: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైనా వైద్యాన్ని అందించడానికి గత ప్రభుత్వం రెండేళ్ల క్రితం గ్రామీణ ప్రాంతాలకు ఆరోగ్య ఉపకేంద్రాల నిర్మాణానికి నిధులను మంజూరు చేసింది. అప్పటి నుంచి కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం మూలంగా ఆరోగ్య ఉప కేంద్రాల పనులు ముందుకుసాగడం లేదు. కొన్ని చోట్ల నిధులు లేక, మరికొన్ని చోట్ల నిధులున్నా పనులు ముందుకు సాగడం లేదు. ఉమ్మడి మిరుదొడ్డి మండలంలోని అల్వాల్, మల్లుపల్లి, మిరుదొడ్డి, ధర్మారం, వీరారెడ్డిపల్లి, ఖాజీపూర్, భూంపల్లి, అక్బర్‌పేట రుద్రారం గ్రామాల్లో ఒక్కొక్క ఆరోగ్య ఉపకేంద్రం నిర్మాణానికి నేషనల్ హెల్త్ మిషన్(ఎన్‌హెచ్‌ఎం) ద్వారా 20లక్షల రూపాయాల నిధులను మంజూరు చేసింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు పనులు కొనసాగుతూనే ఉన్నాయి. ఆయాగ్రామాల్లో ఆరోగ్యఉపకేంద్రాలు నిర్మాణాన్ని పూర్తి చేయకుండానే రంగులు వేసి బిల్లులు తీసుకున్నారనే ఆరోపనలు ఉన్నాయి. ఆరోగ్య ఉపకేంద్రంలో మౌలిక వసతులైన కిటికీలు, డోర్లు, విద్యుత్తు, మంచీనీటి సౌకర్యాలు కూడా ఏర్పాటు చేయలేదు. కొన్ని ప్రాంతాల్లో ఈ ఆరోగ్య ఉపకేంద్రాలు అసాంఘీక కార్యక్రమాలకు అడ్డగా మారాయనే విమర్శలు న్నాయి. పూర్తిస్థాయిలో ఆరోగ్యఉపకేంద్రాల పనులు పూర్తికావాలంటే సుమారు 4 లక్షల రూపాయాల వరకు నిధులు కావాలని అధికారులు అంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న ఆరోగ్యఉపకేంద్రాలను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఆయాగ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఆలయాల్లో దొంగతనం కేసుల్లో నిందితుడికి జైలు

రాయపోల్, ఆగస్టు 23: పెద్దమ్మ ఆలయాల్లో దొంగతనాలు చేసిన కేసులో నిందితుడికి కోర్టు ఏడాది జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధించినట్లు రాయపోల్ ఎస్‌ఐ రఘుపతి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అనాజీపూర్, రాంసాగర్ పెద్దమ్మ ఆలయాల్లో జరిగిన దొంగతనం కేసుల్లో మూడు నెలల క్రితం మిరుదొడ్డి మండలం రుద్రారానికి చెందిన చిట్యాల రాజిరెడ్డిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. అప్పటి నుంచి అతడు రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. ఈ క్రమంలో నిందితుడి తన నేరాన్ని అంగీకరించడంతో శుక్రవారం గజ్వేల్ అదనపు జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ కోర్టు జడ్జి ప్రియాంక ఒక సంవత్సరం జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధించారని ఎస్‌ఐ తెలిపారు.

నరికారు.. తొలగించడం మరిచారు



నరికి వదిలేసిన చెట్ల కొమ్మలు

సిద్దిపేట టౌన్, ఆగస్టు23: హరితహారంలో భాగంగా సిద్దిపేట పట్టణంలోని అన్నీ వార్డుల్లో నాటిన మొక్కలు ఏపుగా పెరిగాయి. విద్యుత్ తీగలకు ఇబ్బందిగా మారడంతో మున్సిపల్, విద్యుత్ అధికారుల సూచన మేరకు సిబ్బంది చెట్ల కొమ్మలను నరికివేస్తున్నారు. నరికి వేసిన కొమ్మలను తీసివేయకుండా కాలనీల్లో, రోడ్లపై అలాగే వదిలేస్తుండడంతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందిగా మారింది. అసలే ఇరుకు రోడ్లు పైగా నరికిన కొమ్మలు అలాగే ఉండడంతో రాత్రి సమయాల్లో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు నరికిన కొమ్మలను తీసివేయాలని ఆయా కాలనీవాసులు కోరుతున్నారు.

సైనిక్ పాఠశాలలో సీటు సాధించిన విద్యార్థి



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రాజేందర్

హుస్నాబాద్‌రూరల్, ఆగస్టు 23: హుస్నాబాద్ పట్టణంలోని కేరళ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌కు చెందిన విద్యార్థి పి. అక్షయ్‌శశాంక్ మహారాష్ట్రలోని సోలాపూర్ సైనిక్ పాఠశాలలో సీటు సాధించాడు. 28 జనవరి 2024లో సైనిక్ స్కూల్‌లో ప్రవేశం కోసం అక్షయ్‌శశాంక్ ప్రవేశ పరీక్షరాశాడు. ఈ సందర్భంగా కేరళా హైస్కూల్ ప్రిన్సిపాల్ బుర్ర రాజేందర్, కరస్పాండెంట్ శైలేందర్, ఉపాధ్యాయులు విద్యార్థి అక్షయ్‌శశాంక్‌ను అభినందించారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరికలు

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 23: కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధిని చూసే పార్టీలో చేరుతున్నారని కాంగ్రెస్ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ పేర్కొన్నారు. సిద్దిపేట అర్బన్ మండలం బూరుగుపల్లిలో బీఆర్ఎస్ నుంచి సుమారు 80 మంది కాంగ్రెస్‌లో చేరినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామ అధ్యక్షుల నుంచి సాధారణ కార్యకర్త వరకు పార్టీలో చేరడం శుభసూచికమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు లక్ష్మి, సీనియర్ నాయకులు కలీమోద్దీన్, దాస అంజన్న, బొమ్మల యాదగిరి, సిద్దిపేట కౌన్సిలర్ బుచ్చిరెడ్డి, స్థానిక నాయకులు బాబురావు, యాదగిరిగౌడ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలి

● సిద్దిపేట ట్రాఫిక్, త్రీటౌన్ సీఐలు ప్రవీణ్‌కుమార్, విద్యాసాగర్

కొండపాక,ఆగస్టు 23: రోడ్డు ప్రమాదాల నివారణకు అందరూ సహకరించాలని సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్, త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్ అన్నారు. దుద్దెడ గ్రామంలోని విలేజ్ రోడ్డు భద్రత కమిటీ మెంబర్లతో రోడ్డు ప్రమాదాల నివారణ గురించి శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పలు సూచనలు చేశారు. అతివేగం, నిద్రలేమితో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో రోడ్‌సేఫ్టీ కమిటీ మెంబర్లు, ట్రాఫిక్ సిబ్బంది, త్రీటౌన్ ఇబ్బంది పాల్గొన్నారు.

'సీసీ కెమెరాలతో నేరాలను అదుపు చేయొచ్చు'



లతీఫ్

తొగుట, ఆగస్టు 23: సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా నేరాలను అదుపుచేయొచ్చని, అందుకోసం ప్రజలు స్వచ్ఛందగా ముందుకు రావాలని తొగుట సీఐ లతీఫ్ కోరారు. తొగుట సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లో ఎవరైనా అపరిచిత వ్యక్తులు తారసపడితే వెంటనే 100 నెంబర్‌కు సమాచారమందించాలని సూచించారు. ప్రజలు ఇంటికి తాళం వేసి ఊరికి వెళితే ఇంట్లోని విలువైన వస్తువులను ఇంట్లో ఉంచకుండా వెంట తీసుకుపోవాలన్నారు. అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సందర్శించిన డీఆర్

సిద్దిపేట క్రైం, ఆగస్టు 23: సిద్దిపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని జిల్లా సబ్ రిజిస్ట్రార్ సుబ్బలక్ష్మి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో విధులు నిర్వహించే సిబ్బందికి ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని లేక ఇతర సమస్యలు ఏమైనా ఉన్నాయా అని సిద్దిపేట సబ్ రిజిస్ట్రార్ శ్రీలతను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా కార్యాలయంలో జరుగుతున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియను గురించి సబ్ రిజిస్ట్రార్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఇంటర్ విద్యార్హతతో నేడు జాబ్‌మేళా

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 23: ఇంటర్మీడియట్ విద్యార్హతతో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు డీఐఈవో రవీందర్‌రెడ్డి శుక్రవారం విడుదల చేసిన పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ నిర్వహిస్తున్న టెకబి ప్రోగ్రామ్‌లో భాగంగా కలెక్టర్ అనుమతితో సిద్దిపేట ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఈ మెగా జాబ్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. 2023-24 విద్యా సంవత్సరంలో బైపీసీ, సీఈసీ, కంప్యూటర్ సైన్స్ గ్రూపుల్లో 75 శాతంతో ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని చెప్పారు. జాబ్‌మేళాకు వచ్చేవారు పదోతరగతి, ఇంటర్మీడియట్ ధ్రువపత్రాలు, ఆధార్‌కార్డు జిరాక్స్, ఒక ఫొటో, స్మార్ట్ ఫోన్ వెంట తెచ్చుకోవాలన్నారు. మరిన్నీ వివరాలకు 7569177071 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

అపరిశుభ్రత



సిద్దిపేట అర్బన్ తహసీల్దార్ కార్యాలయం వెనకాల ఉన్న నాలా దుస్థితి ఇది. చెత్తా చెదారం, గుర్రపు డెక్కతో నిండిపోయి దుర్వాసను వెదజలుతున్నది. వర్షాకాలం కావడంతో నాలాలో గుర్రపు డెక్క మొలిచింది. మరోవైపు ఆ పరిసరాల్లో ఉండే వారు చెత్తా చెదారం అంతా తెచ్చి నాలాలో పోస్తుండడంతో అధ్వానంగా తయారైంది. దీంతో దోమలు వృద్ధి చెంది సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. నాలాలోని చెత్తా, పిచ్చిమొక్కలను తొలంగించాలని మున్సిపల్ సిబ్బందిని స్థానికులు కోరుతున్నారు.

- సిద్దిపేట ఫొటోగ్రాఫర్

భలే బెలూన్లు



రాజస్థాన్ బెలూన్లు సిద్దిపేటలో కనువిందు చేస్తున్నాయి. డోరమాన్, డైనోసార్‌ను పోలిన రంగురంగుల బెలూన్లు పట్టణంలోని పలుచోట్ల రాజస్థాన్ నుంచి వచ్చిన చిరు వ్యాపారులు విక్రయిస్తున్నారు. కలర్‌ఫుల్‌గా కనిపిస్తున్న ఈ బెలూన్లు 100 నుంచి 150 రూపాయల వరకు అమ్ముతున్నారు. చూడడానికి భిన్నంగా ఉండడంతో పిల్లలు కావాలని మారాం చేస్తున్నారు.

- సిద్దిపేట ఫొటోగ్రాఫర్

పేదల సంక్షేమం కోసం కృషి

చేర్యాల, ఆగస్టు 23: పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తున్నదని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్ గౌడ్ అన్నారు. చేర్యాల మండలం ముస్త్యాల గ్రామానికి చెందిన ఎలికట్టె లక్ష్మి కొంత కాలంగా మెదడు సంబంధిత వ్యాధితో బాధపడుతుంది. వైద్యపరీక్షలకయ్యే ఖర్చు భరించే స్తోమతలేక ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న నాగపురి కిరణ్‌కుమార్ బీసీ, రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకువెళ్లి రూ.2.50లక్షలు ఎల్‌ఓసీ మంజూరు చేయించారు. ఈ మేరకు శుక్రవారం అతడి కుటుంబసభ్యుడికి ఎల్‌ఓసీ పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో నాయకులు కొంగరి వెంకట్ స్వామి, ఎలికట్టె శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, మైసయ్య, అంజయ్య, బాలమల్లయ్య, నర్సయ్య, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

కోహెడ/హుస్నాబాద్, ఆగస్టు 23: మండలంలోని బస్వాపూర్ గ్రామంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శుక్రవారం కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మంద ధర్మయ్య, తాటిపాముల ప్రవీన్, మాజీ సర్పంచ్ సత్తయ్య తదితరులున్నారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచనల మేరకు శుక్రవారం హుస్నాబాద్ పట్టణంలోని పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్‌చెక్కులను కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు చిత్తారి పద్మ, వల్లపు రాజు, పున్న లావణ్య, తదితరులున్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జరిమానా

సిద్దిపేట క్రైం, ఆగస్టు 23: సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్, సిబ్బందితో కొన్ని రోజుల క్రితం సిద్దిపేట పట్టణంలోని పలుచోట్ల వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ క్రమంలో ఆరుగురు మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట కోర్టులో హాజరుపరచగా విచారణ చేసి ఆరుగురికి రూ.9500 జరిమానా విధించారు.

'ఒత్తిడి ఉన్నా డిపోను నెంబర్‌వన్‌గా నిలపడం గొప్ప విషయం'



మొక్కను నాటుతున్న ఈడీ వినోద్‌కుమార్

గజ్వేల్, ఆగస్టు 23: ఒత్తిడి ఉన్నా డిపోను నెంబర్‌వన్ స్థానంలో నిలపడం గొప్ప విషయమని టీజీఎస్‌ఆర్టీసీ హైదరాబాద్, కరీంనగర్ జోన్ ఈడీ సి.వినోద్‌కుమార్ పేర్కొన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపోను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిపోలో మొక్కను నాటిని అనంతరం అన్ని సెక్షన్ల సూపర్‌వైజర్లను, ఇతర సిబ్బందితో మాట్లాడారు. రాఖీ చాలెంజ్‌లో భాగంగా ఉద్యోగులంతా అంకితభావంతో పనిచేసి రాష్ట్ర స్థాయిలో 148.85 ఆక్యూపెన్సీ రేషియో సాధించినందుకు ఉద్యోగులను ప్రశంసించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ పవన్, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ బి.బాబునాయక్, మెకానికల్ సూపర్‌వైజర్ జమీల్, డిపో సిబ్బంది ఉన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

● ఎంపీడీవో కృష్ణయ్య



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

కోహెడ, ఆగస్టు 23: మండలంలోని బస్వాపూర్ గ్రామంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టినట్లు ఎంపీడీవో కృష్ణయ్య తెలిపారు. గ్రామంలో శుక్రవారం దోమల నివారణకు ఫాగింగ్ నిర్వహించామన్నారు. నీటి నిలువ ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేసి పారిశుధ్య పనుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. ఆయనవెంట ఇన్‌చార్జి ఎంపీవో శోభ, కార్యదర్శి శ్రీకాంత్ తదితరులున్నారు.

పత్తిలో గులాబీరంగు పురుగు నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

● జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయాధికారి రాధిక



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయాధికారి రాధిక

చేర్యాల, ఆగస్టు 23: పత్తిని ఆశించిన గులాబీరంగు పురుగు నివారణకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయాధికారి, చేర్యాల ఏడీఏ తక్కోలు రాధిక అన్నారు. చేర్యాల మండలం కడవేరుగు గ్రామంలో పత్తిపంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. పత్తిలో గులాబీరంగు పురుగు ఆశించే అవకాశం ఉన్నందున విత్తిన 45రోజుల నుంచి పురుగు ఉనికి గమనించేందుకు లింగాకర్షకబుట్టలు అమర్చాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో భోగేశ్వర్‌రావు, ఏఈవో సమజాత, రైతులు పాల్గొన్నారు.

సంతోషిమాత ఆలయంలో పూజలు



లలితా సహస్రనామ పఠన చేస్తున్న మహిళలు

హుస్నాబాద్ టౌన్, ఆగస్టు 23: శ్రావణ మాసం మూడో శుక్రవారం సందర్భంగా హుస్నాబాద్ పట్టణంలోని సంతోషిమాత ఆలయంలో మహిళలు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా లలితా సహస్రా నామాలు పఠించారు. కార్యక్రమంలో కొత్తపల్లి జ్యోతి, నార్ల విజయలక్ష్మి, చొల్లేటి లతా మూర్తి, శ్రీలత, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

చేర్యాల, ఆగస్టు 23: చేర్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు శుక్రవారం ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ జ్యోతి ప్రారంభించి మాత్రలు వేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి మధు, ఆశా సిబ్బంది పద్మ తదితరులు పాల్గొన్నారు.

హరీశ్‌రావును విమర్శించే స్థాయి లేదు

● బీఆర్ఎస్ ఎస్సీ సెల్ విభాగం నాయకులు



మాట్లాడుతున్న ఎస్సీ సెల్ విభాగం నాయకులు

సిద్దిపేట టౌన్, ఆగస్టు 23: కరోనా సమయంలో ప్రాణప్రాయస్థితిలో ఉన్నప్పుడు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు నుంచి లబ్ధిపొంది, నేడు ఆయనను విమర్శించే స్థాయి నీకు లేదని ఇటీవల బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన నాయకులనుద్దేశించి ఆ పార్టీ ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు సందులాపురం రాజు, ఆ విభాగం నాయకులు సామల్ల సాయి ప్రతాప్ మండిపడ్డారు. సిద్దిపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. సిద్దిపేట అభివృద్ధిని చూసి మైనంపల్లి హనుమంతరావు ఓర్వలేక హరీశ్‌రావుపై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. సిద్దిపేటలో అలర్లు సృష్టించడమే మైనంపల్లి పనిగా పెట్టుకున్నారన్నారు. కాంగ్రెస్‌లో చేరిన నాయకులు బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు అన్నిరకాలుగా లబ్ధి పొందారని, ఇతర పార్టీలోకి వెళ్లి బీఆర్ఎస్‌ను విమర్శిస్తే పెద్ద నాయకులు కాలేరని ఎద్దేవా చేశారు. డబుల్ ఇళ్లు, దళిత బంధు ఇప్పిస్తానని చెప్పి వార్డుల నుంచి డబ్బులు వసూలు చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు ఎల్లుపల్లి రమేశ్, పెర్క మధు, నర్సింహులు, బాబు, పరుశురాములు తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల సంక్షేమం కోసం పాటుపడిన బీఆర్ఎస్

గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా, పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ముస్లిం మైనార్టీల కోసం ఎంతో చేసిందని ఆ పార్టీ మైనార్టీ సెల్ నాయకులు వజీర్, మొహిజ్ అన్నారు. సిద్దిపేట పట్టణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన కొంతమంది కౌన్సిలర్లు బీఆర్ఎస్ మైనార్టీలకు ఏమీ చేయలేదని అంటున్నారని, అది పూర్తిగా అవాస్తవమని మండిపడ్డారు. మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వంలో ఉపముఖ్యమంత్రిగా మైనార్టీని నియమించారని, ఇప్పుడు ప్రభుత్వం కనీసం ఒక్క మంత్రి పదవి కూడా ఇవ్వలేదని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికలకు ముందు ప్రకటించిన విధంగా ముస్లిం, మైనార్టీ డిక్లరేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు సయ్యద్, బాబా, అహ్మద్, మోయిజ్ పాల్గొన్నారు.

విజ్ఞానశాస్త్రం అనేక సమస్యలను పరిష్కరిస్తుంది

● జాతీయ అంతరిక్ష దినోత్సవంలో వక్తలు

హుస్నాబాద్, ఆగస్టు 23: విజ్ఞానశాస్త్రం అనేక సమస్యలకు పరిష్కరిస్తుందని హుస్నాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉపన్యాసకురాలు రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. హుస్నాబాద్ పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ అంతరిక్ష దినాన్ని పురస్కరించుకుని అంతరిక్ష యానం, పరిశోధనలు, ఉపగ్రహాలు అనే అంశంపై నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. విద్యార్థులు శాస్త్ర సాంకేతికను అందిపుచ్చుకుని సమాజానికి ఉపయోగపడే విధంగా పరిశోధనలు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్ క్విజ్‌లో పాల్గొన్న విద్యార్థులకు ధ్రువపత్రాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వాసుదేవరెడ్డి, ఉపాధ్యాయులు వెంకటరమణారెడ్డి, మార్కండేయ, శ్రీధర్, వీరారెడ్డి, సువర్ణలీల, రాజేందర్, రమేశ్, సుభాష్, వెంకటమల్లు, రాజమల్లు, రజిత, రాజయ్య తదితరులున్నారు.

● హుస్నాబాద్‌రూరల్: జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని హుస్నాబాద్ పట్టణంలోని సీవీ రామన్ ఇంగ్లిష్



హుస్నాబాద్: ధ్రువపత్రాలను చూపుతున్నవిద్యార్థులు



మర్కుక్: విద్యార్థులు తయారుచేసిన అంతరిక్ష నమూనాలతో డీఈవో శ్రీనివాస్‌రెడ్డి

మీడియం హైస్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు భారత అంతరిక్ష రంగంలో సాధించిన విజయాలకు సంబంధించిన చంద్రయాన్ 1, 2, 3, మంగళయాన్, గగన్‌యాన్, ఆదిత్య ఎల్-1, వివిధ రాకెట్‌లు, పీఎస్ఎల్‌వీ, జీఎస్ఎల్‌వీ, ఎస్ఎల్‌వీ, ఎంఎల్‌వీ, ఆర్యభట్ట వంటి శాటిలైట్ నమూనాలను తయారు చేసి ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కాయిత నారాయణరెడ్డి, ఉపాధ్యాయులున్నారు.

● మర్కుక్: మండల పరిధిలోని దామరకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం సందర్శించారు. అంతరిక్ష దినోత్సవం సందర్భంగా నిర్వహించిన, వ్యాసరచన, డ్రాయింగ్, క్విజ్, వర్కింగ్ మోడల్ తయారీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి ఉదయభాస్కర్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటరాములు, ఉపాధ్యాయులు చిన్నబ్రహ్మం, కేశవరెడ్డి, ఈవీఎస్‌రెడ్డి పాల్గొన్నారు.

యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సమావేశాలను జయప్రదం చేయాలి

● రాష్ట్ర కమిటీ సభ్యుడు నాచారం శేఖర్

గజ్వేల్, ఆగస్టు 23: ఈ నెల 27, 28 తేదీల్లో సిద్దిపేటలో నిర్వహించే యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సమావేశాలను జయప్రదం చేయాలని ఆ కమిటీ రాష్ట్ర సభ్యుడు నాచారం శేఖర్ పిలుపునిచ్చారు. గజ్వేల్ పట్టణంలో శుక్రవారం నిర్వహించిన యూఎస్ఎఫ్ఐ గజ్వేల్ డివిజన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశాలకు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాలలో ఉన్న యూఎస్ఎఫ్ఐ నాయకులు 100మందికి పైగా హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశాల సందర్భంగా 27వ తేదీన సిద్దిపేటలో ప్రారంభ సభ కూడా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో గజ్వేల్ డివిజన్ నాయకులు వేముల ప్రవీణ్, సందీప్, వంశీ, శివ, సంపత్, శేఖర్, స్వామి, తదితర నాయకులు పాల్గొన్నారు.

ఏఈవో సబిహాకు సన్మానం

అక్కన్నపేట, ఆగస్టు 23: అక్కన్నపేట క్లస్టర్ ఏఈవోగా ఏడు సంవత్సరాలుగా పనిచేస్తున్న సబిహా బదిలీపై వెళ్తున్న సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఏఈవోను శాలువాలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. సన్మానంలో ఎంపీడీవో బానోతు జయరాం, మాజీ సర్పంచ్ ముత్యాల సంజీవరెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన డీఎస్‌వో తనూజ శ్రీ



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీఎస్‌వో

సిద్దిపేట కలెక్టరేట్, ఆగస్టు 23: సిద్దిపేట పట్టణంలోని సంక్షేమ హాస్టల్లో, ఇంద్రనగర్ పాఠశాల, అంగన్‌వాడీ సెంటర్లలో శుక్రవారం మధ్యాహ్న భోజనాన్ని డీఎస్‌వో తనూజ శ్రీ పరిశీలించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డించి, విద్యార్థులతో కలిసి ఆమె భోజనం చేశారు. భోజనం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు.

మాట తప్పిన కాంగ్రెస్

● పీఏసీఎస్ చైర్మన్ పేర్యాల దేవేందర్‌రావు

కోహెడ, ఆగస్టు 23: ప్రభుత్వం మాయమాటలతో ప్రజల్ని మోసం చేస్తున్నదని పీఏసీఎస్ చైర్మన్ పేర్యాల దేవేందర్‌రావు ఆరోపించారు. కోహెడలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. వంద శాతం రుణమాఫీ పచ్చి అబద్ధమన్నారు. రేషన్‌కార్డులు లేని రైతులకు రుణమాఫీ చేయలేదని ఆరోపించారు.

వర్షాకాలం.. కోళ్లకు వ్యాధులు ప్రబలే అవకాశం..!

● జాగ్రత్తలు తీసుకుంటేనే మేలు

● పౌల్ట్రీ రైతులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచిస్తున్న పశువైద్యులు

చిన్నకోడూరు, ఆగస్టు 23: వర్షాకాలంలో బ్యాక్టీరియా, వైరస్‌లు వేగంగా వృద్ధి చెందడం వల్ల కోళ్లకు వ్యాధులు సోకే ప్రమాదం ఉన్నదని చిన్నకోడూరు పశు వైద్యాధికారి డాక్టర్ మంజుల తెలిపారు. ప్రధానంగా ముసురు, ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని పౌల్ట్రీ రైతులకు సూచించారు. వర్షాకాలంలో కోళ్లకు కోలిబాసిల్లోసిస్, ఈకోలి వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నదని, రైతులు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా జాగ్రత్తలు తీసుకుంటూ, కోళ్లను వ్యాధుల బారినపడకుండా చూసుకోవాలని సూచించారు.



పౌల్ట్రీ ఫామ్‌లో కోళ్లు (ఫైల్)

పౌల్ట్రీ ఫామ్‌ల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- వర్షం నీరు లోపలికి వచ్చేలా ఉంటే అంచుల వెంట పాలిథిన్ సంచులు కట్టాలి.
- పౌల్ట్రీఫామ్ షెడ్డు లోపలికి గాలి, వెలుతురు బాగా వచ్చేటట్టు చూసుకోవాలి.
- కోళ్లకు ఉపయోగించే దాణా బస్తాలు తడవకుండా జాగ్రత్త పడాలి. తడిసిన దాణా కోళ్లకు వేస్తే అనారోగ్యానికి గురవుతాయి.
- క్రమం తప్పకుండా కోళ్లకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి.
- వర్షాకాలంలో బావులు, బోర్లలో నీరు కలుషితమయ్యే అవకాశం ఉంటుంది. నీటిని ల్యాబ్‌లో పరీక్షించి వాడుకోవాలి.



మంజుల, పశు వైద్యాధికారి, చిన్నకోడూరు